

# నెరవేరుతున్న.. సొంతింటి కల

- శంకుస్థాపనలతో మంత్రులు, ఎమ్మెల్యేలు బిజీబిజీ
- ముగ్గులు పోస్తున్న ప్రజాప్రతినిధులు
- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- ఒక్కో ఇంటికి రూ.5లక్షల గ్రాంట్
- రాష్ట్ర వ్యాప్తంగా 77.18 లక్షల దరఖాస్తులు
- అర్హులకే ఫలాలు దక్కేలా చర్యలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సొంతింటి కళ నెరవేరుతోందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నిర్మాణ పనులను పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గంలో 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి సొంతింటిని సాకారం చేయనున్నట్లు ప్రకటించారు. పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూంలు అందించలేదని దుయ్యబట్టారు. ప్రకటనలకోసం ఇండ్లను నిర్మించినా వాటిని పేదలకు పంచలేదని విమర్శించారు. దీంతో అవి వృథాగా మారాయన్నారు. వీటి కోసం ఖర్చు చేసిన కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు పూర్తి అయ్యాయని ప్రకటించారు. నెల రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరుగాలని ఆదేశించారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

### 77.18 లక్షల దరఖాస్తులు..

ఇందిరమ్మ ఇంటి పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పథకానికి మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు ప్రకటించారు. అయితే మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున పంపిణీ చేసేందుకు ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామ సభల్లో ఇల్లు లేని నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి పట్టాలు కూడా అందజేశారు.

### బిజీబిజీ..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పాలకులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఎంపికైన లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపనలు చేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు బిజీబిజీగా ఉన్నారు. అనేక ప్రాంతాల్లో ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. నెల రోజుల్లో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఈ సాయాన్ని నాలుగు వడతల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు. కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నా దాంట్లో నిజం లేదంటూ పార్టీ శ్రేణులు కొట్టివేస్తున్నారు. సొంత ఇళ్లు లేని వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు ప్రకటిస్తున్నారు.



# సైకిళ్లపై పోలీసుల గ్రామ సందర్శన

**అభినందిస్తూ ట్విట్టర్ లో పోస్ట్ చేసిన సీఎం రేవంత్**

**వరంగల్ వాయిస్, క్రైం :** విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వినూత్న రీతిలో ఆలోచించిన వంగర ఎస్సై దివ్య తన సిబ్బందితో కలిసి సైకిళ్లపై పెట్రోలింగ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు గ్రామస్తులతో కొద్దిసేపు ముచ్చటించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైకిళ్లపై తమ గ్రామాలకు వచ్చిన పోలీసులను చూసిన గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. సాంఘిక దురాచారాలపై ప్రజలకు చైతన్యం కలిగిస్తూ ఇతర పోలీసులకు ఆదర్శంగా నిలిచిన వంగర పోలీసులను అభినందనలు తెలుపుతూ ముఖ్యమంత్రి ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. యడం జరిగింది.

# మంగ్లీ మందు పార్టీ

- అనుమతి లేకుండా బర్త్ డే వేడుకలు
- తొమ్మిది మందిపై కేసు నమోదు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రముఖ ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్‌డే వేడుకలు వివాదాస్పదంగా మారాయి. చేవెళ్ల శివారలోని ఈర్లపల్లి వద్ద గల ఓ రిసార్ట్స్ లో తన పుట్టినరోజు సందర్భంగా మంగ్లీ తన బందువులకు, స్నేహితులకు పార్టీ ఇచ్చారు. మంగ్లీ బర్త్ డే పార్టీలో ఓ ప్రముఖ గేయ రచయితతోపాటు పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే పర్మిషన్ లేకుండా ఈవెంట్ నిర్వహించడంతో రిసార్ట్ పై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విదేశీ మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు విచ్చల విడిగా గంజాయి వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా పార్టీలో 50 మంది కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొనగా వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. దీంతో మంగ్లీతోపాటు రిసార్ట్ అసిస్టెంట్ మేనేజర్ రామకృష్ణ, ఈవెంట్ మేనేజర్ మేఘరాజ్, దామోదర్ రెడ్డి తదితరులపై కేసులు నమోదైనట్లు ప్రచారం సాగుతోంది.

# ములుగు జిల్లాకు మరో వెయ్యి ఇండ్ల మంజూరు

- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క
- అర్హులందరికీ దశలవారీగా ఇల్లు మంజూరు
- త్వరితగతిన ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**వరంగల్ వాయిస్, ములుగు:** ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలోని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించడమే లక్ష్యమని, గత పాలకులు చేసిన అప్పులను



తీర్చుకుంటూనే, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సంక్షేమ ఫలాలను అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పేద కుటుంబానికి గూడుతో పాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి హెలికాప్టర్ ద్వారా చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్లకు భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ తదితరులు పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం, ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ, నిర్మాణ పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,



దనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ డాక్టర్ శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 23 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడమే కాకుండా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత ఇంచర్ల ఎం.ఆర్. ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 22 వేల 500 కోట్ల రూపాయలతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందని అన్నారు. గతంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిందని గుర్తుచేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు అందిస్తామని మోసం చేశారని, నేడు ఇందిరమ్మ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో దానిని ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.